క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ నేతలు కె.మల్లేశ్వరరావు, సీహెచ్ రంగారావు, మున్సిపల్ కార్మికులు బి.సత్యనారాయణ, నీలపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



గొల్లలకోడేరులో చేకూరి నరేంద్ర రాజును కలిసిన వార్డు సభ్యులు

పాలకోడేరు: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్, ఉండి ఏఎంసీ ఉపాధ్యక్షుడు చేకూరి నరేంద్రరాజు పంచాయతీ వార్డు సభ్యులకు సూచించారు. శుక్రవారం పంచాయతీ వార్డు సభ్యులు ఆయనను కలిసి గ్రామ అభివృద్ధి పై చర్చించారు. పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వార్డు సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయారు. దీంతో గ్రామాభివృద్ధికి అనేక ఆటంకాలు ఏర్పడడంతో అభివృద్ధి మందగించింది. ఇటీవల ఒక వార్డుకు ఉప ఎన్నిక జరిగిన నేపథ్యంలో ఒక వర్గం అభ్యర్థి విజయం సాధించడంతో పరిస్థితులు చక్కబడ్డాయి. అలాగే గురువారం నిర్వహించిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో హరిజనవాడలో చెరువు అభివృద్ధి, చింతలపాటి వారి వీధిలో కల్వర్టు నిర్మాణం, మురుగుకోడు పూడికతీత తదితర అభివృద్ధి పనులపై చర్చించి, ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు.

కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే శ్రీనివాస్



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్టు ఆయన చెప్పారు. తొలుత ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో పీఈటీలు, హెచ్ఎం

ఆకివీడు: తమ పాఠశాలకు చెందిన బాలికలు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.ఇందిర చెప్పారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీల్లో విజయకేతనం ఎగురవేశారన్నారు. షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో ఎ.నవ్య పద్మశ్రీ, లాంగ్‌జంప్ ద్వితీయ, 200, 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో బి.లిఖిత, కబాడీ, వాలీబాల్, యోగాలో మొత్తం 36 మంది ఎంపికయ్యారని ఆమె వివరించారు. పీఈటీలు నీలవేణి, జయలక్ష్మీలను, విద్యార్థినులను అభినందించారు.

సీఐ నాగ ప్రసాద్ బదిలీ

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ సర్కిల్ సీహెచ్ నాగప్రసాద్ బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా చల్లపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగ ప్రసాద్ బదిలీ అయినట్లు పోలీస్ శాఖ ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. సుమారు ఏడాది నుంచి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు.

జెడ్పీ స్కూల్ పరిశీలన

నరసాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలయమవుతున్నాయి. శుక్రవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకూ కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు, గోతుల్లో నీరు నిలిపోయింది. మండలంలోని కాళీపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని జెడ్పీటీసీ పరిశీలించి నీటిని మళ్లించే ఏర్పాటు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న అధిక వర్షం మరింత అధికంగా పడితే సార్వా పంటకు ముప్పు వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు



ఆకివీడు: వెలంపేట రామాలయం వద్ద భగవద్గీత పారయణం చేస్తున్న మహిళలు



ఉండి: ఉండిలో ఆకట్టుకుంటున్న భారీ వినాయక విగ్రహం

ఆకివీడు: గణనాథుని చవితి పందిళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలతో ఆయా ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. స్థానిక శాంతినగర్‌లోని వర సిద్ధి వినాయక ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వెలంపేట రామాలయం వద్ద చవితి పందిరిలో మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. రాజరాజేశ్వరి ఆలయం వద్ద, వనువులమ్మ వారి ఆలయం వద్ద, పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద, మాదివాడ, అయిభీమవరం, కుప్పనపూడి, పెదకాపవరం, చినకాపవరం, వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో వినాయకుడికి పూజలు చేశారు. అలాగే స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద పూలు పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహానికి గజమాల వేసి పూజలు చేశారు. పండ్లు విక్రయించే మట్టా వెంకటలక్ష్మీ తన మనవడు పామర్తి లోకేష్ చరణ్, మనువరాలు తొంటా నవ్య సత్య శ్రీలతో 18.5 కిలోల బరువున్న రెండు లడ్డూలను స్వామివారికి ప్రసాదంగా సమర్పించారు.

ఉండిలో..

ఉండి: వినాయక నవరాత్రిళ్ల సందర్భంగా గ్రామాల్లో వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శుక్రవారం మండలవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

శాకంబరి అలంకరణలో గణపతి



శాకంబరి అలంకరణలో గణపతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి ఆలయంలోని విజయ గణపతి విగ్రహం వద్ద వినాయక చవితి వేడుకల్లో భాగంగా శాకంబరి అలంకరణ చేశారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్, ఈమని పవన్ కుమార్ అధ్వర్యంలో స్వామివారికి దవ్వే రవి, జయశ్రీ దంపతులు, తోటకూర కృష్ణ, ఫణిలక్ష్మి దంపతులచే గణపతి పూజ, అభిషేకాలు, గరిక పూజ, నవగ్రహ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రిజర్వేషన్‌తో మహిళలకు సముచిత స్థానం



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం సమాజంలో సముచిత స్థానం కల్పించినట్లేనని పలువురు మహిళలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం అరసవల్లి ఈశ్వరమ్మ వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్, వివిధ మహిళ సంఘాలు, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్, అలయన్స్ క్లబ్ సభ్యురాండ్రు గంధం శ్రీదేవి, ఆరేటి రాణి, కె.పద్మావతి, మహిళ పోలీస్ ఎండీ షేహనాజ్, మహిళ సంఘాల ప్రతినిధులు పవిత్ర, స్వర్ణ, హైస్కూల్ హెచ్ఎం జె.సుధారాణి మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు ఒకేమాటతో మహిళల కోసం రిజర్వేషన్స్ కల్పించడం మహిళ లోకానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



సీఎస్ఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం దృశ్యం

సాక్షి, భీమవరం: ఎన్ఎస్ఎస్ వారోత్సవాల్లో భాగంగా భీమవరం సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఏఎస్ఎన్ రాజు బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆదుకునేందుకు అందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏఎస్ఎన్ రాజు మాట్లాడుతూ రోగుల అవసరం మేరకు రక్తం అందుబాటులో లేనందున మానవతా దృక్పథంతో రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ బొమ్మదేవర ప్రభాకర్ రావు, రాజ్ కమల్, జితేంద్ర, ఫార్మసీ వైస్ ప్రిన్సిపాల్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన సుమారు వందమంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

స్వమిత్వ పథకానికి రెండు గ్రామాల ఎంపిక



పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పాలకోడేరు: స్వమిత్వ యోజన (సర్వే ఆఫ్ విలేజస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్‌వైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) పథకంలో పాలకోడేరు మండలంలోని గొల్లలకోడేరు వేంద్ర గ్రామాలను ఎంపిక చేశారని ఎంపీడీఓ మురళి గంగాధర్ రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి ఈ విషయం తెలిపినట్లు వివరించారు. స్వమిత్వ అనేది గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకమని కలెక్టర్ తెలిపారు ఈ సామాజిక ఆర్థిక, సాధికారతను, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ పథకంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ 2020 లో ప్రారంభించిన ఆస్తి సర్వే కార్యక్రమం అని వివరించారు. ఎంపిక చేసిన గొల్లలకోడేరు వేంద్ర గ్రామాల్లో తొలుత మొదటి దశలో అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి అసెస్మెంట్ నెంబరు ప్రకారం ఆస్తి విస్తీర్ణం, ఇంటి స్వభావం, సరిహద్దులు నమోదు చేసుకుంటారు. మూడు రోజుల్లోమొ దటి దశను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డ్రోన్ కెమెరాతో సాంకేతికతను ఉపయోగించి సర్వే చేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారని ఎంపీడీఓ తెలిపారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, రీసర్వే డీటీ సూర్యనారాయణ రాజు, ఈఓపీఆర్డీ కాకర్లమూడి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలి



ఉండి ఏఎంసీ నూతన పాలకవర్గ సభ్యులు

ఉండి: ఉండి ఏఎంసీ అభివృద్ధికి నూతన పాలవర్గం కృషి చేయాలని ఏఎంసీ నూతన చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ చేకూరి రాజానరేంద్రకుమార్ అన్నారు. పాలకవర్గ ప్రథమ సమావేశాన్ని ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలవర్గ ప్రమాణస్వీకర కార్యక్రమం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరా శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పిల్లి సుభాష్‌చంద్రబోస్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. అలాగే ముందుగా మహదేవపట్నం గ్రామంలోని సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్‌సెంటర్లను కూడా మంత్రి నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల సత్యనారాయణ(ఉప్పులూరు), కానుబోయిన నాగమణి, బొడ్డు రామకృష, గుండు నాగేశ్వరరావు, అంగర భాగ్యలక్ష్మీ, సిరికి కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

యలమంచిలి: పాలకొల్లు వాకర్స్ క్లబ్ పాలకవర్గ సభ్యులు రెండు రోజుల క్రితం కట్టుపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 20 మంది విద్యార్థులు కళ్ల సమస్యలతో ఉన్నట్లు గుర్తించారు. ఆ 20 మందికి శుక్రవారం వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.16 వేలు విలువైన కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులు చదువులో ప్రగతి సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోటేటి శేషసాయి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమా శంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పాలకొల్లు అర్బన్: రోటరీ యువజన సేవా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా సీనియర్ రొటేరియన్ షేక్ పీర్ సాహెబ్ వ్యవహరించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, మద్దాల వాసు, చందక రాము, కానూరి ప్రభాకర్, పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

తల్లీబిడ్డకు సంపూర్ణ పోషణే ప్రభుత్వ ధ్యేయం



నరసాపురం రూరల్: చిట్టవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: కాజ పడమర అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి అని చిట్టవరం సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్టవరం, గొంది, నవరసపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోవత్సవాలో భాగంగా పోషణమహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీలు మాట్లాడుతూ పుట్టే ప్రతీబిడ్డా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, దానిలో భాగంగానే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు,ఆరేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోళ్ల శ్రీనివాస్, చల్లా సత్యనారాయణ, ఐసీడీసీ సూపర్ వైజర్‌లు, కార్యకర్తలు కె.శ్రీవిద్య, ఐ.రత్నకుమారి, ఎం.స్వప్న, బి.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: కిశోర బాలికలు, గర్భిణులు ప్రతీరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి అన్నారు. వద్దిపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆధ్వర్యంలో 'పోషణ మహా' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహార ప్రదర్శన, కిశోరబాలికలకు, గర్భిణీలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగపద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆరోగ్యపరంగా అనేక సమస్యలు కూడా ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీం మున్నీషా, అంగన్‌వాడీ టీచర్లు గొల్ల బేబీ కుమారి, జి.నోమేశ్వరి, వై.శాంతకుమారి పాల్గొన్నారు. అలాగే మట్టపర్రు శివారు పెదపాలెం అంగన్‌వాడీ పాఠశాలలో శుక్రవారం 'పోషణ మహా' కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.ఎస్.పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు ఎ.పద్మావతి, కె.బేబీ, ఎం.మహాలక్ష్మి, జె.ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మూడేళ్లు నిండిన పిల్లలకు ఏడేళ్లు వచ్చే వరకు బాలామృతం పెట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. కాజ పడమర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన పోషకాహార మాసోత్సవాల సదస్సులో ఆమె పోషకాహార విలువ గురించి వివరించారు. చాలామంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే అంగన్‌వాడీ కేంద్రంలో అందించే ఆహారంతో పాటు మునగాకు తీసుకుంటే మంచిదని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పి.సిల్వియ కుమారి, అంగన్‌వాడీ వర్కర్స్ గీత, సోని హెల్త్ అసిస్టెంట్ రాజబాబు, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు



జాతీయ నాయకుల వేషధారణలో పోటీల్లో పాల్గొన్న స్కూల్ విద్యార్థులు

నరసాపురం: వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ మహాత్ముని 157వ జయంతి సందర్భంగా శుక్రవారం స్కూల్, కాలేజ్ విద్యార్థులకు జిల్లాస్థాయిలో డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, పెను గొండ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పోటీ ల్లో పాల్గొన్నారు. స్కూల్ విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలపై పోటీ లు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు అక్టోబర్ 2న కళాశాలలో బహుమతులు అందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు తెలిపారు.

మౌలిక వసతులపై శ్రద్ధ వహించాలి

భీమవరం అర్బన్: విద్యతోపాటు పాఠశాలల పాలిక వసతులు, మధ్యాహ్నం భోజన పథకం పట్ల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని ఎండీఎం, సర్వశిక్షాభియాన్ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అర్బన్, రూరల్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులందరూ భుజించే విధంగా చూడాలన్నారు. రాగిజావ, చిక్కీలు, గుడ్లు నూరు శాతం విద్యార్థులు తీసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. రోజు వారీ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేసేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. 10 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల బాలికలు రక్తహీనత కలిగి ఉన్నారని జిల్లా వ్యాప్తంగా 24 వేల మందిని గుర్తించామని చెప్పారు. వీరందరికి ప్రతి రోజూ రెండు సార్లు ఐరన్ పోలిక్ మాత్రలు ఇవ్వాలని, గుడ్లు, చిక్కీలు, రాగిజావ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందించేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో జి.చిన్నయ్య, మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఎంపీడీఓ ఆకస్మిక పర్యటన

పెనుమంట్ర: జగనన్న లేవుట్‌లలో గృహనిర్మాణ లబ్ధిదారులు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా తవ్వుకోవాలని ఎంపీడీఓ పి.పద్మజ సూచించారు. శుక్రవారం ఆమె నత్తారామేశ్వరం, జుత్తిగ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి జగనన్న లేఅవుట్‌లు, జగనన్న ఆరోగ్య సురక్ష, సచివాలయాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న లేఅవుట్ లలో గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని జగనన్న ఆరోగ్యసురక్ష పథకాలు కింద వైద్యసిబ్బంది ప్రతీ ఇంటిని సందర్శించి ఆ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా జుత్తిగ గ్రామ పంచాయితీలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ అధికారులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జుత్తిగ, నత్తారామేశ్వరం సర్పంచ్‌లు తమనంపూడి వీరారెడ్డి, వెలగల ధర్మారెడ్డి, హౌసింగ్ అధికారి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కొడమంచిలి గ్రామాభివృద్ధి

పెనుగొండ: మాజీ మంత్రి, ఆచంట శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో గతంలో ఎన్నడూ లేని విధంగా వేగంగా కొడమంచిలిని అభివృద్ధి చేస్తున్నట్లు ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్‌అధ్యక్షుడు, కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారామ్ తెలిపారు. శుక్రవారం కొడమంచిలి పంచాయతీ సమావేశంలో పాల్గొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన రూ.40 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారని వివరించారు. మార్కెట్ సెంటర్ ఎస్సీ ఏరియాలో డ్రెయినేజీ నిర్మాణం, చింతలతోట, టి.మెరకల్లో డ్రెయినేజీ నిర్మాణాకి ఆమోదం తెలిపామన్నారు. ఉత్తమ పంచాయతీగా కేంద్ర ప్రభుత్వం కొడమంచిలి పంచాయతీని ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచ్ ములగాడ వరప్రసాద్, పంచాయతీ సభ్యులు చింతపర్తి దుర్గా, నున్నబోయిన జయలక్ష్మి, నసమండ దానమ్మ, పుచ్చకాయల నాగార్జున, నెక్కంటి రామకృష్ణ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం ఐక్య ఉద్యమం

పెనుగొండ: దళితుల హక్కులు–సామాజిక న్యాయం కోసం వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఐక్యంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టామని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా తెలిపారు. శుక్రవారం పెనుగొండ బాపూజీ పురంలో కర పత్రాల పంపిణీ, సంతకాల సేకరణ నిర్వహించారు. సెప్టెంబరు 21 నుంచి 24 వరకూ జిల్లా దళిత రక్షణ యాత్ర, 29న విజయవాడలో మహా ధర్నా చేపడతున్నట్లు తెలిపారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్ర రెండో రోజునరసాపురం మండలం, పట్టణాల్లో సాగింది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ వి.శివనాగరాణి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతలపై ఐక్యంగా ఉద్యమించాలన్నారు.